

# హైదరాబాద్ వార్త

# నిరసనలు.. వాకౌట్‌లు

- గందరగోళంగా ముగిసిన జిహెచ్‌ఎంసి కౌన్సిల్ మీటింగ్
- తొలిసారిగా సమావేశాన్ని బహిష్కరించిన అధికారులు
- వినూత్న నిరసన తెలిపిన బిజెపి కార్పొరేటర్లు
- లైఫ్ జాకెట్లు, వాటర్ ట్యూబ్‌లతో ప్రదర్శన
- కార్పొరేటర్ల తీరుపై మేయర్ విజయలక్ష్మీ ఆగ్రహం

హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త: జిహెచ్‌ఎంసి కౌన్సిల్ మీటింగ్ బుధవారం రసాభాసగా అర్థాంతరంగా ముగిసింది. వివిధ కారణాలతో ఐదునెలల తర్వాత జరిగిన సమావేశం నిరసనలు, వాగ్వాదాలతో ప్రారంభమైంది. బిజెపి కార్పొరేటర్ల తీరును నిరసిస్తూ.. అధికారుల వాకౌట్ చేశారు. కార్యకలాపాలు ముందుకు సాగకపోవడంతో సమావేశం నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. కాగా అంతకుముందు సమావేశానికి వచ్చిన బిజెపి కార్పొరేటర్లు దోమ వేషాధారణ, లైఫ్ జాకెట్లు ,గొడుగల ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సైతం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. దీంతో విపక్షాల ఆందోళన మధ్యే కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. ఈనేపథ్యంలో జలమండలి కార్యాలయంలో మంగళవారం బిజెపి కార్పొరేటర్ల వ్యవహార శైలికి నిరసనగా వాటర్‌బోర్డు అధికారులు సమావేశాన్ని బహిష్కరించారు. వారికి మద్దతుగా జిహెచ్‌ఎంసి అధికారులు సైతం సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఎంసిహెచ్, ప్రస్తుత జిహెచ్‌ఎంసి చరిత్రలో అధికారులందరూ సమావేశాన్ని బహిష్కరించడం ఇదేతొలిసారి కావడం గమనార్హం.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి సమావేశంలో బిజెపి కార్పొరేటర్లు వినూత్న నిరసన తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా ఉదయం 11గంటలకే బిజెపి కార్పొరేటర్లు కార్యాలయానికి చేరుకున్నారు. "నగర వాసులను రక్షించండి.. ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా ? మంత్రి కెటిఆర్, మేయర్ వెంటనే స్పందించాలంటూ నల్లదుస్తులు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రజలకు రక్షణ లేకుండాపోయిందని బయటకెళ్లిన వ్యక్తి ఎక్కడ శవమై తేలుతాడోనన్న భయం నెలకొందని వాపోయారు. రోడ్డెక్కాలంటే భయంగా ఉందని నాలాలు, మురుగు కాల్వల నిర్వాహణ అత్యంత దారుణంగా తయారైంద న్నారు. పురపాలకశాఖ మంత్రి కెటిఆర్ ,మేయర్ విజయలక్ష్మీ మొద్దునిద్ర వీడి నాలాలు బాగు చేయాలని సూచించారు. వర్షం వస్తే ఏమౌతామోనని తమ వెంట లైఫ్‌జాకెట్లు, ట్యూబ్‌లు తీసుకు వచ్చినట్లు వారు చెప్పారు. అధికారులు కార్యాలయాల నుంచి బయటకు వచ్చి ప్రజల కష్టాలు చూడాలని వందల కోట్లతో నాలాలు అభివృద్ధి చేస్తున్నా పరిస్థితి మారక పోవడం ప్రభుత్వ వైఫల్యమే కారణమని కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆరోపించారు. చిన్నవర్షానికే అనేక కాలనీలు, రహదారులు చెరువుల్లా మారుతున్నా జిహెచ్‌ఎంసి యంత్రాంగానికి చీమకుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. మేయర్,కమిషనర్ ఇప్పటి వరకు వరద ప్రభావిత ప్రాంతాలోల ఎందుకు పర్యటించలేదని వారు ప్రశ్నించారు. ఈసందర్భంగా తమ వెంటన తెచ్చుకున్న లైఫ్ జాకెట్లు ట్యూబ్‌లు అగ్నిమాపక యంత్రాలను తొలగించిన అనంతరం బిజెపి కార్పొరేటర్లను సమావేశంలోకి అనుమతించారు.



బిజెపి కార్పొరేటర్లను అరెస్టు చేస్తున్న పోలీసులు

**అధికారులు బహిష్కరించడం ఇదే తొలిసారి..**

వాటర్‌బోర్డు కార్యాలయంలో బిజెపి కార్పొరేటర్లు మంగళవారం వ్యవహరించిన తీరుకు నిరసనగా బుధవారం నాటి జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశాన్ని వాటర్‌బోర్డు అధికారులు బహిష్కరించారు. వారికి మద్దతుగా జిహెచ్‌ఎంసి అధికారుల సమావేశం నుంచి వెళ్లిపోయారు. గతంలోనూ సభ్యుల తీరుతో అప్పటి కమిషనర్ సోమేష్‌కుమార్ సమావేశం నుంచి బయటకు వెళ్లారు. అనంతరం అప్పటి మేయర్ నచ్చజెప్పడంతో తిరిగి సమావేశం కు హాజరయ్యారు.కానీ పూర్తి స్థాయిలో అధికారులు బహిష్కరించడం ఇదే తొలిసారి.ఈఅంశంపై బిజెపి కార్పొరేటర్లు మాట్లాడుతూ సమస్యలపై ప్రశ్నిస్తే అధికారులు పారిపోయారని ఎద్దేవ చేశారు.

**రాజకీయ లబ్ది కోసం బిజెపి యత్నం : మేయర్ గద్వాల విజయలక్ష్మీ**

జిహెచ్‌ఎంసి సమావేశం జరగకుండా చూడాలని బిజెపి ప్రయత్నిస్తుంది. సమావేశంలో సమస్యలు పరిష్కరించకుండా వాగ్వాదానికి దిగుతున్నారు. ప్రజాధాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. బిజెపి కార్పొరేటర్ల వ్యవహారశైలిని ఖండిస్తున్నాం. బిజెపి నేతల దూషణలను అధికారులు వ్యతిరేకిస్తున్నారు. అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని అధికారులు బాధపడుతున్నారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి రాజకీయ లబ్దికోసం బిజెపి నేతలు యత్నిస్తున్నారు. జలమండలి అధికారులు సమావేశం వాకౌట్ చేశారు. బిజెపి కార్పొరేటర్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆందోళన చేశారు. ప్రతిసారి కౌన్సిల్ సమావేశం అడ్డుకోవాలని వారు చూస్తున్నారు అని విజయలక్ష్మి అన్నారు.

## ఉరేసుకొని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



సురేఖ (ఫైల్ ఫోటో)

చాంద్రాయణగుట్ట, మే 3 ప్రభాతవార్త : పెళ్లికి జాతకాలు కలవడం లేదని ఓ మహిళా కానిస్టేబుల్ మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాలిబండా పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన సురేఖ(28), 2018 బ్యాచ్ శాలిబండా శంషీర్‌గంజ్ కాల్వగడ్డలో సోదరి దగ్గర ఉంటూ ఛత్రినాక పోలీస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆమెకు గతంలో పెళ్ళి సంబంధం రద్దు అయ్యింది. కాగా రెండవసారి కందూరుకు చెందిన వ్యక్తితో ఈ నెల 1వ తేదిన నిచ్చితార్థం జరిగింది. నిచ్చితార్థం జరిగిన మరుసటిరోజు సోదరి ఇంటికి వచ్చింది. జాతకాలు చూద్దామని ఆరా తీయగా ఇద్దరి జాతకాలు కలవలేదు. వరుసకు కొడుకు అవుతున్నాడు. కాగా ఇంట్లో చర్చలు జరుగుతుండగా మనస్థాపానికి గురైంది. ఈ నెల 2వ తేదిన ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సోదరి ఉద్యోగానికి వెళ్లి బుధవారం 11 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. సోదరి తలుపులు తీయకపోవడంతో ధ్వంసం చేశారు. అప్పటికే సురేఖ ఫ్యాన్‌రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే శాలిబండా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పలనక్స్ ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

### కాలిబూడిదైన ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలు

దుండిగల్, మే 3 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ పరిధి ఏలిప్ పారిశ్రామికవాడలోని పలనక్స్ ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆఫీస్‌లోని ఫర్నిచర్‌తో పాటు ల్యాబ్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ప్రమాద సమయంలో ల్యాబ్‌లో కార్మికులు ఎవరు లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. సమచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలు పూర్తిగా ధ్వంసం అవడంతో భారీ నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా పలనక్స్ సంస్థకు ఎటువంటి ఇన్సూరెన్స్ లేనట్టు సమాచారం. కనీసం సంస్థకు అనుమతులు ఉన్నాయనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఘటనాస్థలిని సందర్శించిన దుండిగల్ ఎస్సై సర్దార్‌నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపటినట్లు తెలిసింది.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

## కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి





ఒయు ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

తార్నాక, మే 3 ప్రభాతవార్త: కాంట్రాక్ట్ అద్యాపకులను రెగ్యూలరైజ్ చేస్తామని హామినిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తమను రెగ్యూలరైజ్ చేయడం లేదని పలువురు కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆరోపించారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాల యాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఓ.యూ పరిపాలనా భవనం నుంచి ఆర్ట్స్ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓ.యూ టీచర్స్ అసోషియేషన్ కాంట్రాక్ట్ అద్యక్షులు ప్రొఫెసర్లు ఏ.డా.పరుశురాం, వర్కింగ్ ప్రసిడెంట్ డా. ధర్మతేజ, డా. వినీతా పాండే, ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో సీఎం కేసీఆర్ జీవో నెం.16 ప్రకారం ఓ.యూలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యూలరైజ్ చేస్తామని హామినిచ్చారని గుర్తు చేశారు. కాని ఇప్పుడు ప్రభుత్వ కాంట్రాక్ట్ డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ లెక్చరర్ సర్వీసులను క్రమబద్ధీకరించింది కాని మమ్ములను విస్మరించడం బాదకల్గిస్తుందన్నారు. ఏఐసీటీఈ,యూజీసీ నిబంధనల ప్రకారం ఏ అర్హతలు కల్గి ఉన్నారో తాము కూడా అవే అర్హతలు కల్గివున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## యువతకు చేరుతున్న మాదకద్రవ్యాలు

### విచ్చలవిడిగా డ్రగ్స్, గంజాయి సరఫరా

### సేవించేవారిలో ధనికులు, విద్యార్థులే అధికం

### పూర్తిగా అరికట్టడంలో అధికారులు విఫలం

హైదరాబాద్, మే 3,ప్రభాతవార్త: ఇటీవల డ్రగ్స్, గంజాయిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా..వివిధ ప్రాంతాల నుంచి నగరానికి సరఫరా మాత్రం ఆగట్లేదు. డ్రగ్స్,గంజాయి సేవించే వారు నిత్యం మత్తులో తూగుతన్నారు. కొకైన్.. ఎల్‌ఎల్‌డీ, బ్రౌన్ షుగర్, ఎండీఎంఏ.. పేర్లు వేరైనా అన్నింటిది ఒకే జాతి. అన్నీ మత్తులో ముంచేస్తాయి. ఈవిషయం తెలిసీ కొందరు వాటి బారినపడి నష్టపోవడమే కాకుండా కొత్తవారికి అలవాటు చేసివారి ఆరోగ్యాన్ని నాశనం చేస్తుండటం గమనార్హం. ఎట్రాక్షన్.. ఎంజాయ్‌మెంట్ ఇవే యువత పాలిట శాపంగా మారుతున్నాయి. ఊహాలోకంలోకి తీసుకెళ్లే మత్తు వారిని బలిపశువులుగా మారుస్తుంది. ఇటీవల ఓప్రభుత్వశాఖలో ఉన్నతోద్యోగి వచ్చే సంపాదనతో కొడుకుకూతిరిని చదివిస్తున్నాడు. ఆకస్మాత్తుగా కొడుకులో మార్పు. ఇంజనీరింగ్ చదివి.. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న కుమారుడు ప్రవర్తన తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసింది. వాస్తవం తెలియటంతో ఉలిక్కి పడ్డారు. అతడు రెండేళ్ల నుంచి డ్రగ్స్‌తీసుకుంటున్నాడు. ఒక్కరోజు దాన్ని తీసుకోకుంటే తట్టుకోలేక గిజగిజలాడుతున్నాడు.ప్రస్తుతం అతని చదువు మాన్పించి రిహాబిలిటేషన్ కేంద్రంలో ఉంచి వైద్య చికిత్స చేయిస్తున్నారు. ఒదిఒక ఉదాహారణ మాత్రమే సరదగా మొదలైన అలవాటు తర్వాత దానికి బానిసలవుతున్నారు. నగరానికి చాపకింద నీరులా గంజాయి., హెరాయిన్, నల్లమందు వంటి మత్తుపదార్థాలు చేరుతూనే ఉన్నాయి. ఖరీదైన పబ్‌ల్లో కొకైన్.. హెరాయిన్.. మధ్యతరగతి యువతకు గంజాయి చేరుతోంది.



**టార్గెట్ పబ్‌లు, కళాశాలలు..** పబ్బులు, కళాశాలల్లో సిగరెట్ అలవాటున్న విద్యార్థికి గంజాయి, డ్రగ్స్ అలవాటు చేస్తారు. ఒకసారి రుచిచూసాక దానికోసం ఎంతైన డబ్బు ఇచ్చేందుకు వెనుకంజ వేయనంత వరకు బానిసచేస్తారు.అలా విద్యార్థులు నెమ్మదిగా ఎక్కిన మత్తు .అదిలేకపోతే తట్టుకోలేనంత వరకు చేరుతుంది. బంజారాహిల్స్,జూబ్లీహిల్స్ లో కొన్ని పబ్‌లు, టీస్టాల్స్, స్నూకర్ సెంటర్లు, హుక్కాలో గంజాయి, డ్రగ్స్ చేర్చి యువత నుంచి అందినకాడికి గుంజుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లకు కూతవేటు దూరంలో అర్థరాత్రి వరకు పార్టీలు జరుగుతూనే ఉన్నాయి. వీకెండ్‌లో తెల్లవారుజాము వరకు జరుగుతున్నాయి. ఇక్కడా ఇదే తంతు అన్నఆరోపణలు ఉన్నాయి.

**వైజాగ్, ఒడిషాల నుంచి గంజాయి సరఫరా..** విశాఖపట్నం, ఒడిశానుంచి నగరానికి రోడ్డు,రైళ్ల మార్గం ద్వారా నగరానికి నిత్యం గంజాయి చేరుతుంది. సికింద్రాబాద్,చిలకలగూడ,ఎల్బీనగర్, ధూల్‌పేట్,అప్జల్‌గంజ్ తదితర ప్రాంతాల్లో విక్రయం జోరుగా సాగుతున్నట్లు సమాచారం. కిలోలేదా ఐదారు కిలోలు సరుకు దళారులు ఇక్కడికి చేరుస్తున్నారు. దాన్ని పూర్తిగా అమ్మిన తర్వాత మాత్రమేసరుకును ఆర్డర్ ఇస్తారు. అక్రమార్కులు తమగుట్టు బయటపడకుండా జాగ్రత్తగా చేరాల్సిన చోటికి సరుకును చేర్చటంలో ప్రత్యేకశైలిని అనుసరిస్తున్నారు. ముందుగా ఫోన్‌కాల్ ద్వారా సరుకును సరఫరా చేకే వాహనదారులతో ఒప్పందం కుదుర్చుకుని దాన్ని నిర్ణయించిన ప్రదేశానికి చేర్చేందుకు దూరాన్నిబట్టి కిరాయి చెల్లిస్తున్నారు.గత నాలుగేళ్లతో పోల్చితే మత్తుపదార్థాలు అక్రమంగా రవాణా చేస్తూ పట్టుడిన వారిసంఖ్య నాలుగింతలైంది. ఖాకీల కన్నుగప్పి కొన్నిపబ్బులు యువతకు మత్తు వల విసురుతున్నాయి. కొత్తలోకంలో విహరిస్తున్నామని భ్రమిస్తున్న కుర్రాళ్లు ఆస్పత్రుల పాలవుతున్నారు. కన్నవారికి కన్నీళ్లు మిగుల్చుతున్నారు.



## నెహ్రూ జూలాజికల్ పార్కులో అంతర్జాతీయ చిరుత పులి దినోత్సవం

చార్మినార్, మే 3 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో బుధవారం అంతర్జాతీయ చిరుత పులి దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జూ పార్కులో పలు కార్యక్రమాలు నిర్వహించారు. జూ పార్కు సిబ్బంది పాఠశాలల విద్యార్థులకు చిరుత పులులు గురించి వివరించారు.చిరుత పులులపై డాక్యుమెంటరీ ప్రదర్శన జరిగింది.అంతర్జాతీయ చిరుత పులి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.పోటీలలో గెలు పొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్,పిఆర్‌ఓ మహ్మద్ హనీఫ్‌తో పాటు జూపార్కు ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.కాగా పాతబస్తీలో ఉన్ననెహ్రూ జూలాజికల్ పార్కులో ప్రస్తుతం రెండు ఆడ,రెండు మగ చిరుత పులులు ఉన్నాయి.ప్రతీ రోజు చిరుత పులులకు ఉదయం కిలోన్నర చికెన్, అర లీటర్ పాలు, సాయంత్రం నాలుగు నుంచి ఐదు కిలోల మాంసాన్ని ఆహారంగా అందిస్తారు.

## సమస్యల పరిష్కారానికి ఇంటరాక్షన్ పర్యటనలు

### డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



డీఎంసీకి ఆదేశాలు జారీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, మే 3 ప్రభాతవార్త: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్‌లలో జీహెచ్‌ఎంసీ చేపట్టిన కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికా రులను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్‌తో పాటు కిలిసి ప్రతిరోజు ఎంపిక చేసిన కాలనీలు, బస్తీల్లో విధిగా అధికార యంత్రాంగం పర్యటించి వారి ద్వారా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్య లకు సంబందించిన వివరాలను తమకు అందజేయాలని పద్మారావుగౌడ్ సూచించారు. సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఇందుకు సంబంధించిన సమావేశాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌ల పరిధిలోని 121 బస్తీలు, కాలనీలలో జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు వివిధ విభాగాల అధికారులు సంయుక్తంగా పర్యటించేలా ఈ కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యాక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. అధికార యంత్రాంగం నిర్వహించే ఈ పర్యట నలు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఉపకరిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ దశరథ్ ఇతర అధికారులు, నేతలు పాల్గొన్నారు.

## ఎందుకంత నిర్లక్ష్యం

### డ్రైనేజీపై మూతను సరిచేయాలి : స్థానికుల వినతి



అసంపూర్తిగా మూసి ఉన్న డ్రైనేజీ

కొంపల్లి, మే3 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి సినీ ప్లానెట్ సమీపంలో డ్రైనేజీ మూత తెరచి ఉండడంతో పాదాచారులు, వాహనదారులు, స్థానికులు భయాందోళనకు గురువుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై నిలిచిన వరదనీటిని మళ్లించడానికి డ్రైనేజీ మూతలు తెరవడంతో స్థానికులు, పాదాచారులు, వాహనదారులు గమనించిక ప్రమాదాల బారి నపడుతున్నారు. ఈ విషయంపై పలు మార్లు మున్సిపల్ సిబ్బందికి, అధికారులకు స్థానికులు సమాచారం అందించిన పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్పందించి డ్రైనేజీ మూతలను పూర్తి మూసివేసి ప్రమాదాల నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## కెమికల్ కంపెనీ బాయిలర్‌లో పడి కార్మికుడి మృతి

### జీడిమెట్ల పారిశ్రామికవాడలోని హెటిరో యూనిట్‌లో గుట్టుచప్పుడు కాకుండా శవాన్ని తరలించిన యాజమాన్యం



మహేందర్(పాస్‌పోర్టు సైజ్)

కుత్బుల్లాపూర్, మే 3 ప్రభాతవార్త : జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ప్రముఖ రసాయన కంపెనీలో బాయిలర్‌ను శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు బాయిలర్‌లో పడి ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన తీవ్ర ఆందోళనకుగురిచేసింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా సూర్యానగర్‌కు చెందిన లక్ష్మన్ కుమారుడు మహేందర్ (28)మూడున్నర ఏళ్లక్రితం నగర శివారు జీడిమెట్ల పారిశ్రామికవాడలోని హెటిరో-3లో ప్రొడెక్షన్ మిక్స్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తు సూరారం కాలనీ రాజీవ్‌గాంధీనగర్‌లో ఉంటున్నాడు. రోజు మాదిరిగానే విధి నిర్వాహణకు బుధవారం వచ్చిన మహేదర్ పరిశ్రమలో రియాక్షన్ అనంతరం బాయిలర్‌ను శుభ్రపరుస్తున్నాడు. ఈ క్రమంలో యంత్రంలో బ్లేడ్స్ తగిలి తీవ్రగాయాలకు గురయ్యాడు. వెంటనే కంపెనీ నిర్వాహకులు గుట్టుచప్పుడు కాకుండా మహేందర్‌ను సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా పరీక్షలు నిర్వ హించిన డాక్టర్లు అప్పటికే మహేందర్ మృతిచెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పవన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## బైకులు చోరీ చేసిన 4గురు అరెస్టు..ఆరు బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను చూపిస్తున్న ఎసిపి ఆకుల శ్రీనివాస్, ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్

తార్నాక, మే 3 ప్రభాతవార్త: బైకులను చోరి చేసి తప్పించుకొని తిరుగుతున్న దొంగలను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు బైకులను స్వాదీనం చేసుకున్నారు. కాచిగూడ ఏసీపీ ఆకుల శ్రీనివాస్ కథనం ప్రకారం. మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఫిరోజ్(22) పాత నేరస్తుడు. మౌలాలికి చెందిన శ్యామ్ సుందర్(23), అకాశ్(24) మరో మైనర్‌తో కలిసి పార్కు చేసిఉన్న బైకులను చోరిచేస్తుంటారు. చోరి చేసిన బైకులను ఒడిస్సా ప్రాంతాల్లో తక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ వచ్చిన డబ్బుతో మధ్యం,పొగాకు తాగి జల్సాలకు బానిసలుగా మారారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తెల్లవారు జామున వీరు చోరిచేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై 4గురు యువకులు వెళుతుండగా పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు వారిని ఆపి వాహనానికి సంభందించి పేపర్లు అడుగడంలో వారి వద్దలేవు. దీంతో వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారించగా చోరీలకు సంబంధించి వివరాలను పోలీసులకు చెప్పారు. వారు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిల్లో చేసిన చోరిలకు గురైన 6 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 4గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడైన ఒడిస్సాకు చెందిన మనిమోహన్ శికారి(23) పరారీలో ఉన్నాడు. ఈ కార్యక్రమంలో ఓ.యూ ఇన్స్‌పెక్టర్ రమేష్ నాయక్, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై బిక్షం పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం

### సిపిఐ నగర శాఖ



సిపిఐ పాదయాత్రలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఛాయాదేవి, బి.వెంకటస్వామిగౌడ్, స్టాలిన్ తదితరులు

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని సిపిఐ నగర కార్యదర్శి ఛాయాదేవి, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ బి.వెంకటస్వామిగౌడ్ తెలిపారు. బుధవారం సిపిఐ ముషీరాబాద్ నియోజకవర్గం కమిటీ కార్యదర్శి బి.వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజెపికో హటావో-దేశ్‌కో బచావో కార్యక్రమంలో భాగంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి స్టాలిన్, సిహెచ్.శ్రీనివాస్, కుమార్, ఉమర్‌ఖాన్, ఆనంద్‌గౌడ్, ఉపేందర్, విశాల్, తిరుపతతి, వెంకటేశ్, శివ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛాయాదేవి, వెంకటస్వామిగౌడ్‌మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ తప్పుడు ఆర్థిక విధానాల వల్ల దేశంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఇంధన, నిత్యావసర ధరల వేగవంతమైన పెరుగుదల తీవ్ర సంక్షోభానికి దారితీసిందని అన్నారు. ఆర్థిక పునరుద్ధరణ పేరిట సామాన్యులు వినియోగించే దాదాపు అన్ని వస్తూవులపై జీఎస్టీ వేసి మోదీ ప్రభుత్వం నడ్డివిరుస్తుందని ఆమె పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ధణవంతుల నుంచి తక్కువ పన్ను, పేద ప్రజల నుంచి ఎక్కువ పన్నులు వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై భారం మోపుతుందని ఆమె మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం మరింత నిరంకుశ ధోరణిలో పరిణామం చెందితే దేశానికే అత్యంత ప్రమాదకరమని, ప్రజలు గమనించి వచ్చే ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ప్రశ్నించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్, మే 3 ప్రభాతవార్త: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 11కేవీ మల్లంపేట్, 11కేవీ నిజాంపేట్ ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు పత్రికా ప్రకటనలో తెలిపారు. 11కేవీ మల్లంపేట్ ఫీడర్ పరిధి రెయిన్‌బో కాలనీ,ఎస్ఆర్ఆర్ ప్రైడ్, ప్రశాంత్ విల్లాస్ కేఆర్‌సీఆర్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ ఉండదు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ, ఎస్ఎంఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో బాచుపల్లి విజి, ఇందిరానగర్, ఎస్ఎల్‌జీ ఆసుపత్రి, మా విల్లాస్, బాచుపల్లి సిగ్నల్ ఫ్లైఓవర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాని అధికారులు కోరుతున్నారు.

## అమర వీరుల ఆశయాల సాధన కోసంమే ఎఐవైఎఫ్ ఆవిర్భవించింది


ఎఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన శ్రీకాంత్

సైఫాబాద్, మే 3 ప్రభాతవార్త: దేశం కోసం ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్ సింగ్, చంద్రశేఖర్‌అజాద్, అల్లూరి సీతారా మరాజుల అశయాల సాధనకు 1959 మే 3వ తేదీన అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఢిల్లీలో ఆవిర్భవించిందని సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్ తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కోసం పోరాడి విజయం సాధించిన ఏకైక యువజన సంఘం ఎఐవైఎఫ్ అని స్పష్టం చేశారు. ఎఐవైఎఫ్ 64వ అవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం నాడిక్కడ సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట సమాఖ్య జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కుల, మత, విచ్ఛిన్నకర వాదులకు ఎదురొడ్డి నిలిచి అంటరానితనం, సాంఘిత దురాచారాలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా యువతను పెడ త్రోవ పట్టిస్తున్న మద్యపానం, అశ్లీల సాహిత్యం, అర్థనగ్న సినిమాలకు వ్యతిరేకంగా 'క్విట్ అశ్లీలత' పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తున్నదని ఎఐవైఎఫ్ అని చెప్పారు. దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఒక నిర్దిష్టమైన చట్టం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించాలని, ఆ సంస్థల ద్వారా స్థానిక యువతకు 50 శాతం ఉద్యోగాలు కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు నిర్ణయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు మర్రి శ్రీమాన్, మాజీద్‌ఆలీఖాన్, రాజు, నరసింహ, దవరథ్, హుస్సేన్ పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కార్పొరేటర్


నీరా కేఫ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

మూసాపేట, మే 3, ప్రభాతవార్త : హైదరాబాద్ నగర వాసులకు స్వచ్ఛమైన నీరాను అందించాలనే లక్ష్యంతో నెక్లెస్ రోడ్డులో తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన నీరా కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై ఎక్సైజ్, క్రీడా, పర్యాటకశాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నరసింహయాదవ్, పోశెట్టిగౌడ్, యాదగిరి, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గౌడన్నలకు భరోసా గీత బీమా

సిద్దిపేట రూరల్, మే 3, ప్రభాతవార్త: రాష్ట్రంలో రైతు బీమా అమలు చేస్తున్న తీరులోనే కల్లుగీత కార్మికులకు గీత బీమా అమలు చేయడంతో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు,సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లె బాలకిషన్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేటలోని పాపన్నగౌడ్ చౌరస్తాలో సిఎం కెసిఆర్, మంత్రులు తన్నీరు హరీష్‌రావు, శ్రీనివాస్ గౌడ్‌ల చిత్ర పటాలకు బుధవారం పాలాభిషేకం చేసి మాట్లాడారు. కల్లుగీస్తూ ప్రమాదంలో ప్రాణాలను కోల్పోతే గీత కార్మికుని కుటుంబానికి రూ.5 లక్షల బీమ సాయాన్ని నేరుగా వారి ఖాతాలో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. గీతా కార్మికుల సంక్షేమం, గౌడ జాతి అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు గడ్డమీది యాదగిరిగౌడ్, ముంద్రాతి రాజుగౌడ్, మంచిల్ల శ్రీనివాస్‌గౌడ్, రామంచ మల్లేశంగౌడ్,గుర్రం బాల రాజుగౌడ్, బొల్లం అంజయ్యగౌడ్,గుర్రం మహేష్ గౌడ్, మంతూరి బాలకిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా సిఎం సహాయనిధి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**


లబ్ధిదారులకు ఎల్.ఓ.సి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం

మూసాపేట, మే 3, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమానికి పూర్తి భరోసా నిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా విడుదైన లక్ష రూపాల ఎల్.ఓ.సి చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారుడైన కె.ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చికిత్స తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు.

## అధ్యాత్మిక, విద్యాకేంద్రాలను స్థాపించనున్న ఉదాసీన్‌మఠ్

దుండిగల్, మే 3 ప్రభాతవార్త : దేశవిదేశాల్లో లక్షలాది అధ్యాత్మిక అనుచరులను కలిగిన ఉదాసీన్‌మఠ్ కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలోని తన భూముల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అధ్యాత్మిక, విద్యాకేంద్రాలను నెలకొల్పనున్నట్లు ఉదాసీన్‌మఠ్ ఉపాధ్యక్షులు మహంత్ అరుణ్‌దాస్ పేర్కొన్నారు. శ్రీపంచాయితి అఖాడబాద్ ఉదాసీన్ అధ్యక్షులు మహంత్ రఘుముని ఆధ్వర్యంలో ఈనెల 5న ఉదయం 11:05నిలకు నిర్వహించే భూమిపూజ కార్యక్రమానికి ప్రపంచ నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. జివోసి లిమిటేడ్ సంస్థకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో సుధీర్ఘ న్యాయ పోరాటం చేసిన అనంతరం ఆ భూములు మఠ్‌కే చెందుతాయని తీర్పునివ్వడంతో వై జంక్షన్ సమీపంలో ఉన్న 540.30ఎకరాల భూములను ఉదాసీన్‌మఠ్ స్వాధీనం చేసుకుంది. నూతనంగా ఏర్పాటు అవుతున్న కేంద్రంలో దశలవారీగా ప్రజోపయోగ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని మఠ్ నిర్ణయించిందన్నారు. ఈసంస్థలో ప్రాథమికంగా విద్య, వైద్య, ఉపాధి, శిక్షణ కేంద్రాలతో పాటు సంత్‌నివాస్, వేద పాఠశాల, యాగశాల, గోశాలను తొలిదశలో నిర్మించనున్నట్లు తెలిపారు.

## బొడ్రాయి ప్రతిష్టాపన ఉత్సవాలు

బెజ్జంకి, మే 3, ప్రభాతవార్త : మండల పరిధిలోని గూడెం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. గ్రామస్తుల అధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాయకులు ద్యావ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే రసమయిని శాలువాతో సత్కరించారు. అయన వెంట నాయకులు మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్తా, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం


భక్తులకు అన్నప్రసాదం వడ్డన చేస్తున్న కొలన్ అభిషేక్‌రెడ్డి

నిజాంపేట్,మే3 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 12వడివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్2లోని పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో నవగ్రహ నాగ సుబ్రహ్మణ్య ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం దేవాలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవానికి తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను విమర్శించిన, ఆరోపణలు చేసినా..
## తగిన గుణపాఠం చెబుతాం : జక్కుల మహేశ్వర్‌రెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్త: స్వార్ధ రాజకీయాల కోసం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ ప్రజలను మభ్యపెడుతూ సెంటిమెంట్‌తో పదవి తెచ్చుకున్న రామక్రిష్ణకు కంటోన్మెంట్ ప్రజలు త్వరలో తగిన గుణపాఠం చెబుతారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జె.ఎం.ఆర్.మాట్లాడుతూ పదవి వ్యామోహం కోసం బిజెపి పార్టీలో చేరి కంటోన్మెంట్‌లో పార్టీ కార్యకర్తలను ఎదగనివ్వకుండా ఏక చక్రాదిపతిగా వ్యవహరించడంతో బిజెపి పార్టీలో ఒక్కరు కూడా రామక్రిష్ణకు మద్దతు తెలుపడం లేదన్నారు. బిఆర్ఎస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలు ఉన్నాయని ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఇటీవల బిఆర్ఎస్ తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనంలో కంటోన్మెంట్ సభలో ఊహించని విధంగా స్పందన లభించడంతో ముఖ్య మంత్రి కేసిఆర్, ఐటీ మంత్రి కేటిఆర్‌లు ప్రశంసించారన్నారు. దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కూతుర్లకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. పార్టీలో చిచ్చుపెట్టే విధంగా ఆరోపణలు చేస్తే రామక్రిష్ణకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. చవట, బట్టెవాయి మాటలు మాట్లాడితే బిఆర్ఎస్ పార్టీ నేతలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథం,నళిని కిరణ్, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : మంత్రి తలసాని


కంటి అపరేషన్ కోసం మంత్రి తలసాని చేతుల మీదుగా ఆర్థిక సహాయం చేస్తున్న బి.ఎల్. ఆర్.చారిటబుల్ ట్రస్ట్

అడ్డగుట్ట, మే 3 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజల వైద్యానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హబ్సిగూడ ప్రాంతానికి చెందిన ఓ పత్రికా విలేకరి సంతోష్ కుమార్తెల కంటి అపరేషన్ కోసం బి.ఎల్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేసిన 1.50 లక్ష రూపాయల చెక్కును బుధవారం మంత్రి తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, ప్రతినిధులు శంకర్, చాందుపాషా, పవన్, భాస్కర్ పాల్గొన్నారు.

## దళిత బంధు అవినీతి ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలి

**మహాజన సోషలిస్టు పార్టీ**

సికింద్రాబాద్, మే 2 ప్రభాతవార్త: దళిత బంధు పథకంలో అవినీతికి పాల్పడ్డ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) సికింద్రాబాద్ నియోజకవర్గం కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ మాదిగ డిమాండ్ చేశారు. ఎంఎస్పీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం పార్సిగుట్ట చౌరస్తా వద్ద నిరసన కార్యాక్రమం చేపట్టారు. ముందుగా ఇక్కడ గల అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత బంధులో లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టకపోవడం, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం దళితులను ఇంకా మోసం చేయడమేనని అన్నారు. అవినీతిని ముఖ్యమంత్రి సమర్థిస్తున్నట్లేనని తెలిపారు. ఇప్పటికైనా వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ, సూరారం సుజాత, చింతల రాజేందర్, యాదగిరి, నర్సింగ్, త్రినేత్ర, సురేష్, బాబు, రరేందర్, యాదగిరి ఇతర నేతలు పాల్గొన్నారు.

## వివిస్టీ వర్కర్స్ యూనియన్ నేతకు శ్రమశక్తి అవార్డు ప్రదానం

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: వివిస్టీ వర్కర్స్‌యూనియన్ కోశాధికారి నరేందర్‌గౌడ్‌కు శ్రమశక్తి అవార్డు లభించింది. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సి.మల్లారెడ్డి చేతులమీదుగా మేడే సందర్భంగా ఆ అవార్డును నరేందర్‌గౌడ్ అందుకున్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి విఎస్టీ యూనియన్ కార్యాలయం ఆవరణలో యూనియన్ అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నేత, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి శ్రమ శక్తి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా నరేందర్‌గౌడ్‌ను సత్కరించి అభినందించారు. కార్మికులకు సంబంధించిన సమస్యల పరిష్కారంతో పాటు తాను పనిచేస్తున్న సంస్థ పురోభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి ఇటువంటి అవార్డులను అందించడం మంచి సంప్రదాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐ.ప్రభాకర్, హారీ సిల్వెస్టర్, బాబీ, రాములు, ఆతీక్ అహ్మద్, శంకర్‌రావు, రణధీర్‌రెడ్డి, మల్లేశం, మధుసూదన్, సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శ్రీనివాసులు, కృష్ణ పాల్గొన్నారు.

## గణపతి ఆలయం అభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే ముఠాగోపాల్**


పనులను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్.వెంకటరమణ, వెంకటగోవిందరావు, రమణమూర్తి, రాజా శ్రీనివాస్, హనుమంతరావు, దశరథ్, హరిత, స్వరూపలతో కలిసి ఆలయం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇప్పటికే ఆలయం ఎంతో అభివృద్ధి సాధించిందని, మరిన్ని త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు శంకర్ మూదిరాజ్, శ్రీధర్‌చారి, కరికె కిరణ్, తుడుం లక్ష్మీ, ఆలయం సిబ్బందది రాజన్, రాజు, ఆలయం అర్చకులు జగన్మోహనాచార్యులు, రామాచార్యులు, బుచ్చమాచార్యులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీలల్లో ఉద్యోగాల భర్తీకై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**డా.పిడమర్తి రవి**


బస్సుయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డా.పిడమర్తి రవి, విజయ్

తార్నాక, మే 3 ప్రభాతవార్త: యూనివర్సిటీలల్లో దీర్గ కాలికంగా ఖాలీగా ఉన్న ఉద్యోగాల భర్తీకై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా.పిడమర్తి రవి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మిడతనపల్లి విజయ్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్రను మిడతన పల్లి విజయ్‌తో కలిసి పిడమర్తి రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. పిడమర్తి రవి మాట్లాడుతూ అన్ని వర్సిటీలల్లో ఖాలీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మిడతన పల్లి విజయ్ మాట్లాడుతూ విద్యార్థి నిరుద్యోగులు సీరియస్‌గా తీసుకొని ప్రభుత్వంపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. ఈ యాత్రతో నిరుద్యోగుల సమస్యలు సీఎం కేసీఆర్‌కు వినిపించేలా అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి భారీ భహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తుర్క నర్సింహ్మ, చొప్పరి శంకర్, పిట్ల రమేష్, రెడ్డి శ్రీనివాస్‌ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, వెంకట్ యాదవ్, వీర రాఊ, మెహన్ నాయక్, వినోద్, రమేష్, జనార్ధన్, ఆశోక్, రవి, సురేష్, రాజేందర్, నవీన్, రామకృష్ణ, సురేందర్, అజయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్రైస్తవుల సమస్యలను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తా..

**ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్**


ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్, మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్‌ను కలిసిన తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో క్రైస్తవులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలంగాణ ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్, మాజీ ఎంపి బి.వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ నాయకత్వంలో వినోద్‌కుమార్‌ను కలిసి సమస్యలను ప్రస్తావించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న చర్చ్ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, పాస్టర్లకు నెలవారి తోడ్పాటును అందించే చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన వినోద్‌కుమార్ ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి అన్నిసమస్యలను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు పి.మెన్నో జోయల్, జయకుమార్, బెన్నినాయ్ రిచర్డ్, జయప్రకాశ్, ప్రబోధ్ విల్సన్, హేమలత, షాలిని, వి.ఆనంద తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి : నరేందర్


మణికొండ మున్సిపాలిటీ నెక్‌నాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్

నార్సింగి, మే 3 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం నెక్‌నాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో కంటి వెలుగు సెంటర్‌ను కౌన్సిలర్లు పద్మారావ్, లక్ష్మీనారాయణలతో కలిసి చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంటి వెలుగు కేంద్రాలలో నిరుపేదలందరికి ఉచితంగా కంటి పరీక్షలు చేయించి, అవసరమైన వారికి అద్దాలు సైతం ఉచితంగానే అందజేస్తున్నారన్నారు. నెక్‌నాంపూర్‌లోని పరిసర ప్రాంతాలలోని ప్రజలందరూ ఈ కేంద్రానికి వచ్చి తమ కంటి చూపును మెరుగు పర్చుకొని, ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ నరేందర్ ముదిరాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీపిఎఆర్ఎస్ జిల్లా అధ్యక్షులుగా వడ్డెపల్లి జయరాజు

కంటోన్మెంట్,మే 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న జంగిటి శ్రీనివాస్‌ను తెలంగాణ పేదల ఆర్థిక, రాజ్యాధి కార సమితి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అదే విధంగా జిల్లా అధ్యక్షులుగా, ఆటో కార్మిక అధికార ప్రతినిధిగా వడ్డేపల్లి జయరాజులను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సింగారం ప్రేమ్‌కుమార్ నియా మకపత్రాలను అంద జేశారు. ఈ సందర్భంగా జంగిటి శ్రీనివాస్, వడ్డెపల్లి జయరాజు లు మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్య తలను వమ్ము చే యకుండా పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు.

## అస్తవ్యస్తంగా ఉన్న నగరంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ధర్నాచౌక్, మే 3, ప్రభాతవార్త: అకాలవర్షాలతో అస్తవ్యస్తంగా తయారయిన నగరంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 15 రోజులుగా అకాల వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతూ ఉంటే ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోకపోవటం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో వర్షాలతో కరెంటు స్థంబాలు పడిపోయి ప్రజలు చీకటిలో మగ్గిపోతున్నా, రవాణాకు అంతరాయం ఏర్పడి పేద ప్రజలు సహాయక చర్యలకోసం ఎదురుచూస్తూ ఉంటే ప్రభుత్వం కళ్లున్న గుడ్డివాడిలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో వర్షాలు పడితే మోరీలు, నాలాలు నిండిపోయి ప్రాణ నష్టం జరుగుతూ ఉంటే, నగరానికి కొత్త వెలుగులు తెస్తున్నామని మున్సిపల్ శాఖా మంత్రి ప్రకటనలు చేయటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో విశ్వనగరం కాస్తా విషాద నగరంగా మారింది అనటానికి ఉదాహరణ కళాసిగూడలో చిన్నారి మౌనిక నాలాలో పడి మృతిచెందటమని, ఈఘటనకు బాధ్యతగా మున్సిపల్ శాఖామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, పరిస్థితులను చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లె కిషోర్, ప్రధాన కార్యదర్శి పి.బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కళాసంస్థలు దేవాలయాలు, కళాకారులు దైవస్వరూపులు

**వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు**

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: విఖ్యాత దర్శకుడు దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, దర్శకుల సంఘం నిర్వహణలో ఇటీవల కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజుకు 'దాసరి కళాసామ్రాట్' బిరుదు ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సుజారమణ కల్చరల్ అకాడమి అధినేతలు సుజాత, రమణమూర్తి ఆధ్వర్యంలో అభినందన సత్కార సభ జరిగింది. జంటనగరాల గాయనీ గాయకులు రామరాజు వంశీ సంస్థను ఏబై ఏళ్ళ క్రితం స్థాపించి ఎందరో కళాకారులకు వేదిక కల్పించడం,విఖ్యాత సాహితీవేత్తలకు నటులను సత్కరించడంతో పాటు వికలాంగ ఆశ్రమం ద్వారా సేవా కార్యక్రమంతో సమాజంలో గుర్తింపు పొందారని కొనియాడారు. మెడిద సుబ్బయ్య ట్రస్టీ ఎంవి.రావు, నిర్వాహకులు సుజాత, రమణమూర్తి అభినందనలు తెలిపారు. వంశీ రామరాజు మాట్లాడుతూ దాసరి నారాయణరావు తనకు అత్యంత ఆత్మీయుడని, ఆయన పేరిట సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు బిరుదు ప్రదానం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. కళాసంస్థలు దేవాలయాలు, కళాకారులు దైవస్వరూపులు అని అన్నారు.

## అభివృద్ధి పనులే ప్రకాశ్‌గౌడ్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిపాయి

**అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలి**

నార్సింగి, మే 3 ప్రభాతవార్త : గత 14సంవత్సరాలుగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, వందల కోట్లతో అభివృద్ధి పనులు చేయడం వల్లనే రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ప్రకాశ్‌గౌడ్‌ను హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకున్నారని గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. బుధవారం నార్సింగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, చేస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎవరు పని చేస్తున్నారో? ఎవరు ప్రజలకు అందుబాటులో ఉన్నారో? ప్రజలకు పూర్తి అవగాహన ఉందని, నాయకులే ఇంకా కన్ఫ్యూజన్‌లో ఉండి రాజకీయ ఆరోపణలు చేస్తున్నారన్నారు. మొదటి సారి 7.వేలు, రెండోసారి 26వేలు, మూడోసారి 60.వేల ఓట్లతో ప్రకాశ్‌గౌడ్‌ను ప్రజలు గెలిపించుకున్నారని, నాలుగోసారి లక్ష మెజారిటీతో గెలిపించుకుంటారని నర్సిహ్మా స్పష్టం చేశారు. ఖానాపూర్, కోకాపేట్, విప్రో భూ బాధితులకు ఇచ్చిన పట్టాలకు పొజిషన్ ఇప్పించేందుకు ఎమ్మెల్యే మంత్రులను కోరడం జరిగిందని, త్వరలోనే న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.

## పార్టీ గద్దె నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

సిద్దిపేట రూరల్, మే 3, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని కాంచీట్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ జెండా గద్దె ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సంపత్‌కుఉ వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ అధికారులు వెంటను గద్దె నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని అధికారులు అనుమతి ఇచ్చిన ఇవ్వకున్న గద్దె నిర్మాణం చేపడుతామన్నారు. కాంచీట్ చౌరస్తాలో బిఆర్ఎస్ గద్దె నిర్మించారని వారికి ఇచ్చినట్లే తమకు అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గాయసుద్దీన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం రాష్ట్ర స్థాయి సదస్సులు



సదస్సులో పాల్గొన్న విశ్వవిద్యాలయం సంచాలకులు డాక్టర్. వి.సుధారాణి, రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్

మైలార్‌దేవ్‌పల్లి, మే 3 ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం రాష్ట్ర స్థాయి సదస్సు బుధవారం రాజేంద్రనగర్‌లోని ఆడిటోరియంలో ప్రారంభమైంది.ఈ రాష్ట్ర స్థాయి సదస్సు మూడు రోజుల పాటు కొనసాగుతుంది.విశ్వవిదా ్యలయం పరిధిలోని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏరువాక కేంద్రాలు,కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తరణ విద్యాసంస్థ, వ్యవసాయం సమాచార కేంద్రం, ఎలక్ట్రానిక్ విభాగంలో పని చేసే శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొన్నారు. 2023-24 సంవత్సరంలో అమలు చేయవలసిన కార్యచరణ ప్రణాళికను సదస్సులో రూపొందించనున్నారు.విశ్వవిదా ్యలయం సంచాలకులు డాక్టర్.వి.సుధారాణి గత సంవత్సరం ప్రగతి గురించి వివరించారు.నిత్యం రైతులకు అవసరమైన సేవల్ని అందించటానికి కృషి చేస్తున్నామని ఆమె తెలియజేశారు.యూనివర్శిటి యూట్యూబ్ ఛానల్ ద్వారా 389 వీడియోలను అప్లోడ్ చేశామని,దాదాపు 81 లక్షల మంది రైతులు ఛానల్‌ని సబ్‌స్క్రైబ్ చేసుకున్నారని ఆమె తెలిపారు.అన్ని ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలు,తీణధాన్యాల ప్రదర్శన శాలల్ని ఏర్పాటు చేయవలసిందిగా పరిశోధన సంచాలకులు డాక్టర్. వెంకటరమణ సూచించారు. రిజిస్ట్రార్ ఎస్.సుధీర్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణలో సాగు అద్భుతమైన పురోగతని సాధిస్తుందని తెలిపారు. ఈ సదస్సులో యూనివర్శిటి అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : మన్నె క్రిషాంక్


1వ వార్డు బాపూజీ నగర్‌లో ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్, చిత్రంలో జంపనప్రతాప్, వేణుమాధవ శర్మ

కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని తెలంగాణ రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీ ముత్యాలమ్మ అలయ నిర్మాణానికి బుధవారం చేపట్టిన భూమి పూజకు రాష్ట్ర కార్మిక మంత్రి మల్లారెడ్డి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, జక్కుల మహేశ్వర్ రెడ్డి, ఉజ్జయిని మహకాళి ప్రధాన అర్చకులు వేణు మాధవ శర్మలు పాల్గొని ఆలయ భూమి పూజ పునర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ ముత్యాలమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉందన్నారు. అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, అజిత్, లక్ష్మణ్, కొమురయ్య, నర్సింహ్మా, ప్రేమ్, మోనీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కంటి వెలుగు కార్యక్రమం అద్భుతమైంది


పీజీ కళాశాలలో కంటి వెలుగు పరీక్షా శిబిరాన్ని ప్రారంభిస్తున్న మర్రి, టీఎస్ఎమ్ఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, వైద్యాధికారి వెంకటి

బేగంపేట మే 3,ప్రభాతవార్త : కంటి వెలుగు కార్యక్రమం అద్భుతమైనది అని కంటోన్మెంట్ నియోజకవర్గం ఇంచార్జి మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ బాలంరాయి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరిక్షా కేంద్రాన్ని మర్రి రాజశేఖరరెడ్డి వైద్యాధికారి డాక్టర్ వెంకటి,టీఎస్ఎమ్ఎస్ఐడీసీ చైర్మన్ డా,ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక వ్యక్తికి కళ్లు ఎంతో ముఖ్యమైనవి అని,అలాంటి కళ్లను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి బస్తీలో ప్రారంభించి ప్రతి ఒక్కరినీ కంటి సమస్యలనుంచి కాపాడారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు విడతలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల పేదలకు మేలు జరిగిందని అన్నారు.పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరిక్షా శిభిరాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు,బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్,మహంకాళీ శర్వేన్,సృజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం ముగ్ధమనోహారంగా కూచిపూడి రంగప్రవేశం


భావన కూచిపూడి నృత్యప్రదర్శన

రవీంద్రభారతి, మే 3 ప్రభాతవార్త : ప్రముఖ నాట్యగురువు నళినిరమణ శిష్యురాలు గుట్టి భావన భారతీయ శాస్త్రీయ కళలపై మక్కువతో కర్ణాటక సంగీతం, తెలుగుజాతి శాస్త్రీయ నృత్యం కూచిపూడిని తన 8వ నుండి గురువు వద్ద శిక్షణ ప్రారంభించి ప్రస్తుతం డాక్టరుగా ఉన్నతవిద్యను పొందిన తర్వాత కూడా నృత్యాన్ని కొనసాగిస్తూ కూచిపూడి నృత్యంలోని సంపూర్ణ మెళకువలు అభ్యసించి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో బుధవారం రాత్రి తన కూచిపూడి రంగప్రవేశం లోనే పూర్తి పరిణతిపొందిన కళాకారిణిగా ముగ్ధమనోహారంగా అద్భుత ప్రదర్శించి హాజరైన అశేష ప్రేక్షకులకు, కళాప్రియులకు నేత్రపర్వంతో మంత్రముగ్ధులను చేసింది. భావన తన రంగప్రవేశాన్ని ముందుగా నాటరాగం ఆదితాళంలో ఆనందనర్తన గణపతి అంశంతో విఘ్ననాయకుడుని పూజించి, అన్నమయ్య కీర్తన కులుకగ నడవరో; రాగమాలికరాగం మిశ్రచాపు తాళంలో భామకలాపం; శివదీక్ష జావళి; శరణం భవ తరంగం, చివరిగా సూరతిరాగం థాలమాళిక తాళంలో తిల్లానా అంశాలను శృతి లయబద్ధంగా, పదనర్తన, హావభావాలను జనరంజకంగా ప్రదర్శిస్తూ ఆహుతుల హర్షధ్వానాల మధ్య శుభాశీస్సులందుకుంది. గురువు ఎస్.నళినిరమణ, చంద్రకాంత్‌లు నట్టువాంగం; మంతా శ్రీనివాస్ గాత్రం; శ్రీధరాచార్యులు మృదంగం; అనిల్‌కుమార్ వయోలిన్; శేషమ్ రమణ వేణువులతో అద్భుత వాద్యసహకారం అందించి భావన కూచిపూడి రంగప్రవేశాన్ని మరింత రక్తికట్టించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ అతిథులు కళాకారిణి భావన ఎంతగానో అభినందించి ఆశీర్వదించి నృత్యగురువు నళిని రమణను ఘనంగా సత్కరించారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి


డ్రైనేజీ పైప్ లైన్ శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 3 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో 99 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన డ్రైనేజీ పైప్ లైన్ పనులకు బుధవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ది కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. డ్రైనేజీ లైన్‌కు నిధులు కేటాయించినందుకు డివిజన్ అధ్యక్షులు ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్‌లు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్, రమేష్ బాబు,సి.హెచ్.శ్రీవర్ధన్‌రెడ్డి,సాయి ప్రతాప్‌రెడ్డి,గొనె ముత్యం రెడ్డి,తుంగ లింగారెడ్డి,సయ్యద్ ముజామిల్ అహ్మద్,సలీం భాయి,పడమటి శ్రీధర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ విలీనం కోసం 50వేల పోస్ట్ కార్డులతో ఉద్యమం


రసూల్‌పురా 2వ వార్డులో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన వికాస్‌మంచ్ సభ్యులు

బేగంపేట మే 3,ప్రభాతవార్త : సికింద్రాబాద్,కంటోన్మెంట్ సివిల్ ప్రాంతాల విలీనం,ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం వికాస్ మంచ్ ఆధ్వర్యంలో బుధవారం రసూల్ పురా 2వ వార్డులో 50వేల పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు విలీనంపై జరపాల్సిన సంప్రదింపులు ఉత్తర ప్రత్యుత్తరాలు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారుల కమిటీ సభ్యులకి విలీనంపై నివేదిక చేసి నాలుగు నెలలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం మరియూ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనంపై ఇవ్వాల్సిన ప్రొసీడింగ్స్ ఆర్డరు జాప్యం,సికింద్రా బాద్ కంటోన్మెంట్ క్లాస్ 1 కేటగిరికి చెందినది కాబట్టీ 50వేల పోస్ట్ కార్డులతో ప్రజా ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ అధ్యక్షులు గడ్డం అబేల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్,ఎలగంటి ప్రభుగుప్తా, మహ్మద్ ఫసీ,అరుణ్‌యాదవ్,సాంసన్‌రాజు,బాబు,హరిబాబు ,శ్యాంరాజు,సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఢిల్లీ వెళ్లి కిషన్ రెడ్డిని పరామర్శించిన సనత్‌నగర్ బిజెపి నేత

బేగంపేట మే 3,ప్రభాతవార్త : ఇటీవల కాలంలో అనారోగ్యానికి గురైన కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు చీరె సత్యనారాయణ అలియాస్ శ్రీకాంత్ బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెల్సుకుని పరామర్శించారు. కిషన్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ చీరె శ్రీకాంత్ సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో అర్చనలు చేయించిన కుంకుమ,షిర్డీసాయినాధుని విభూది ప్రసాదాలను కిషన్ రెడ్డికి అందించారు. త్వరగా కోలుకోవాలని నియోజకవర్గ ప్రజలంతా కోరుకుంటున్నారని,ఆయన త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో వస్తారని చీరె శ్రీకాంత్ ఆశాభావం వ్యక్తం చేసారు. అభిమానులు ఆందోళణ చెందాల్సిన పనిలేదన్నారు.

## ప్యాట్నీ నాలా అభివృద్ధికి చర్యలు చేపట్టాలి : శ్యామ్‌సన్‌రాజు


నాలాల ఆధునీకరణకు చర్యలు చేపట్టాలని సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేత శ్యామ్‌సన్ రాజు, కాంగ్రెస్ నేత దేవుడు తదితరులు

కంటోన్మెంట్, మే 3 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లో నాలాల ఆధునీకరకకు చర్యలు చేపట్టాలని కోరుతూ కంటోన్మెంట్ 2వ వార్డుకు చెందిన బిజెపి నాయకుడు శ్యామన్‌సన్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బోర్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్యామ్‌సన్ రాజు మాట్లాడుతూ మారేడ్‌పల్లి, జెబిఎస్, రసూల్‌పురా, ప్యాట్నీ నాలా వరకు వరద నీటి నాలాలు ఆక్రమణకు గురి కావడం, డిసెల్టింగ్ చేయకపోవడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడు చుట్టుప్రక్కల కాలనీలు, బస్తీలు ముంపునకు గురౌతున్నాయన్నారు. అటు వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సిఈఓకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. అందుకు సిఈఓ మధుకర్ నాయక్ సానుకూలంగా స్పందించారన్నారు.

## కార్మికులకు 'లీగల్ అవేర్‌నెస్ క్యాంప్'


కార్మికులకు లీగల్ అవేర్‌నెస్ కల్పిస్తున్న రాధికా జైశ్వాల్, సురేష్

నాంపల్లి, మే 3 ప్రభాతవార్త : నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యూఢిల్లీ వారి క్యాలెండర్ యాక్టివిటీని అనుసరించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్-మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.ప్రేమవతి మార్గదర్శకత్వంలో మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హైదరాబాద్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్ కార్మిక దినోత్సవం సందర్భంగా కర్మాగారాలలో పనిచేసే కార్మికులకు లీగల్ అవేర్‌నెస్ క్యాంపు పార్లే-జి ఫ్యాక్టరీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ వ్యవస్థాపకుడు సురేష్, నిర్వాహకుడు ఆనంద్‌లు ఆమె స్వాగతం పలికారు. ఫ్యాక్టరీలోని కార్మికులంతా పాల్గొన్న ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం మొత్తంలో అందుబాటులో ఉన్న న్యాయ సేవల సౌకర్యాలపై కార్మికులకు రాధిక జైశ్వాల్ సవివరపరిచారు. ఇలాగే ఉచిత న్యాయ సహాయం తదితర వివరాలు తెలుపుతూ ప్రతీ కార్మికుడికి వైద్య సదుపాయాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలంటీర్, కోఆర్డినేటర్ సత్యనారాయణ, సైదాబాద్ పోలీస్‌స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యం గింజ లేకుండా కొంటాం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : రైతు సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ముందుకు సాగుతున్నారని..అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల అర్థిక సహాయం అందించి అదుకుంటామని..తడిసిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడొద్దని రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డులో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజితవేణుగోపాల్‌రెడ్డితో కలిసి తడిసిన ధాన్యం పరిశీలించారు. అనంతరం రైతులను, మహిళ రైతులను అప్యాయంగా పలకరిస్తూ అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మామూలు వరి ధాన్యానికి చెల్లించే ధరనే తడిసిన ధాన్యానికి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. వ్యవసాయాన్ని కాపాడుతూ రైతుల కష్టాల్లో భాగస్వామ్యం పంచుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా ఒకే ఒక్కడు సిఎం కెసిఆర్ రైతుల కోసం అలోచన చేస్తున్నారని తెలిపారు.

## సమాజాన్ని జాగృతం చేసేందుకు అంబేద్కర్ కృషిని ప్రతి ఒక్కరు ఆచరించాలి

### ఎన్‌సీఎస్‌సీ నేషనల్ డైరెక్టర్ డా.సునీల్ కుమార్ బాబు


మహనీయుల జయంతి వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంబిస్తున్న డా.సునీల్‌కుమార్, డా. హేమలత

తార్నాక, మే 3 ప్రభాతవార్త: స్ఫూర్తి ప్రదాత డా.బీఆర్ అంబేద్కర్ అని నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్ నేషనల్ డైరెక్టర్ డా.సునిల్‌కుమార్ బాబు పేర్కొన్నారు. తార్నాకలోని జాతీయ పోషకాహారం సంస్థ(ఎన్ఐఎన్)లో ఐసీఎంఆర్ ఎన్ఐఎన్‌లో ఆధ్వర్యంలో డా.బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్ రాం జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన నేషనల్ డైరెక్టర్ డా. సునిల్ కుమార్ బాబు ఎన్ఐఎన్ డైరెక్టర్ డా.హేమలతతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. సునిల్ కుమార్ మాట్లాడుతూ సమాజాన్ని జాగృతం చేసేందుకు అంబేద్కర్ చేసిన కృషిని ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు సంబందించి ఎలాంటి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తున్నామన్నారు. ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత మాట్లాడుతూ మహనీయులు చూపిన మార్గాన్ని అందరం ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కె.హరినారాయణ, కోకన్వీనర్ ఎస్.లక్ష్మణ్, ఎస్సీ,ఎస్టీ అసోషియేషన్ అధ్యక్షులు సత్యపాల్, సైంటిస్ట్ డా.ఎన్.అరలప్పా, సైంటిస్టులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశాలను వాయిదావేసుకుంటూ వెళ్తే ఎలా?

### సమస్యలుఎలా పరిష్కారమవుతాయి

### తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, మే 3 ప్రభాతవార్త: ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశతో జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశాలు జరగాలే తప్ప అర్ధాంతరంగా వాయిదావేసుకుని వెళ్లిపోవడం మంచి సంప్రదాయం కాదని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ విమర్శించారు. బుధవారం గాంధీనగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో పావనీ వినయకుమార్ మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం సమావేశాలు జరగాలని అన్నారు. కౌన్సిల్ సమావేశాలకు తాను హాజరై పలు ప్రశలకు సమాధానాలు రాబట్టేందుకు వెళ్లానని, ఇందులో స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం పనుల వేగవంతం విషయంలో జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశంలో తనతో పాటు బిజెపి కార్పొరేటర్లు ఎక్కడ ప్రశ్నలు సంధిస్తారోననే భయంతో సమావేశాలను వాయిదా వేసుకుని వెళ్లిపోవడం జరిగిందని, చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా అధికారులు సమావేశాలను వాయిదా వేసుకుని వెళ్లిపోవడం జరిగిందని, చరిత్రలో అధికారులు సమావేశాలను బాయ్‌కాట్ చేసి వెళ్ళడం సిగ్గుచేటని, దీనికి మేయర్, కమిషనర్ కూడా అభ్యంతరం చెప్పకపోవడం ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆమె తీవ్రస్థాయిలో విమర్శించారు. అశోక్‌నగర్ నుంచి ఆర్టీసి క్రాస్‌రోడ్స్ వరకు స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి కావడానికి ఎంత వ్యవధి పడుతుంది, రోడ్లనీనన పూర్తిగా మూసివేయడం కారణంగా ఈ రోడ్డుపై నిర్వహించబడుతున్న చిన్నచిన్న వ్యాపారాలు దెబ్బతిన్నాయని, వ్యాపారస్తులకు పార్కింగ్ స్థలం కేటాయింపు తదితర అంశాలపై కొంతకాలంగా తాను పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి పనులు నిర్మాణంలో ఉన్నదన్న విషయాన్ని తాను కౌన్సిల్‌లో ప్రశ్నలు వేయాలని వస్తే మేయర్, కమిషనర్ సంబంధిత అధికారులు తాను ప్రశ్నలకు ఎక్కడ సమాధానాలు చెప్పాల్సి వస్తుందనే భయంతోనే తనకు లిఖితపూర్వకంగా సమాధానం తెలపడం సిగ్గుచేటని అన్నారు. హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ విషయంలో తనకు ప్రశ్నలు వేసే అవకాశం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న బిజెపి కార్పొరేటర్లకు ఎక్కడ ప్రజల్లో మంచి పేరు వస్తుందనే భయంతోనే కావాలని జిహెచ్‌ఎంసి కౌన్సిల్ సమావేశాలను అర్ధాంతరంగా వేయిదా వేయడం దారుణమని అన్నారు. ప్రతీసారి ఏదో కారణంతో సమావేశాలను వాయిదా వేసుకుంటూ వెళ్తే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. వాటర్‌బోర్డు ఎండి కార్యాలయం ముందు బిజెపి కార్పొరేటర్లు ధర్నా చేసినందుకే నేడు కౌన్సిల్‌కు బోర్డు ఉన్నతాధికారులు హాజరవడం జరిగిందని, కాని అధికారులు మాత్రం సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. ఇదే విధంగా ప్రజా సమస్యలను పరిష్కరించకుంగా కౌన్సిల్ సమావేశాలను ఒక్క ప్రణాళికాప్రకారంగా వాయిదా వేసుకుంటూ వెళ్తే మాత్రం సహించబోమని, ప్రజాక్షేత్రంలోనే తాము సమాధానం చెబుతామని హెచ్చరించారు. కార్పొరేటర్ వెంట నగర బిజెపి నేత ఎ.వినయకుమార్ తదితరులున్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

తొగుట, మే 3, ప్రభాతవార్త : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చిక్కుడు చంద్రం అన్నారు. మండల పరిధిలోని తుక్కాపూర్‌లో ఐకెపి, సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. అకాల వర్షం మూలంగా తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఐకెపి, సొసైటీ సిబ్బంది, హమాలీ కార్మికులు లింగాల శ్రీలత స్వామి, బోయిన బాలరాజు, బరెంకుల భవాని రవి, లింగాల భవాని, లక్ష్మీ, మానస, రేణుక, కరుణాకర్, రమేష్, కనకయ్య, కరుణాకర్, శీను, సంజీవులు, ఐలయ్య, యాదయ్య, రైతులు అంజిరెడ్డి, ఎల్లయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుడికందులలో.. అధికారులు సమన్వయంతో పని చేసి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సొసైటీ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణరెడ్డి, ఎఎంసి చైర్మన్ దోమల కొమురయ్యలు అన్నారు. మండల పరిధిలోని గుడికందుల గ్రామంలో సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సిఎం కెసిఆర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా 17 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఐకెపి ద్వారా 12, సొసైటీ ద్వారా 5 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరపొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగనిగళ్ల మల్లయ్య, ఎఎంసి డైరెక్టర్ బాలర్‌రెడ్డి, వార్డు సభ్యులు పర్శరాములు, నాయకులు చింత బైరెడ్డి పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సిఎం

గజ్వేల్, మే 3 ప్రభాతవార్త : ప్రజ్ఞాపూర్ ప్రజల చిరకాలవాంఛ అయిన బస్టాండ్ నిర్మాణానికి సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావులు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద నూతన బస్టాండ్ నిర్మాణం కొరకు ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, భూమిపూజ చేశారు.

# జలమండలి కార్యాలయంపై దాడి సరికాదు

### జరిగిన ఘటన బాధాకరం.. జలమండలి ఎండి దానకిషోర్

హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త : జలమండలి కార్యాలయంపై మంగళవారం జరిగిన ఘటన బాధకరం అని జలమండలి ఎండి దానకిషోర్ అన్నారు. ప్రజలు, ప్రజాత్రపినిధులు, పార్టీలకు అతీంగా అందరూ జలమండలి అధికారులు, సిబ్బందికి సహకరించాలన్నారు. బుధవారం జలమండలి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అందరూ సహకరిస్తే ఇంకా మంచి సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. నగర ప్రజల అవసరాలు తీర్చడానికి తమ ఉద్యోగులు, సిబ్బంది కష్టపడి పనిచేస్తున్నారాన్నరు. దేశంలో మన కంటే పెద్ద నగరాలు ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ ఇతర అంశాల్లో హైదరాబాద్ నగరానికి కేంద్రం, ఇతర రాష్ట్రాల నుంచి అవార్డులు,న ప్రశంసలు దక్కాయన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా అనేక ప్రాజెక్టులు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే శివారు మున్సిపాలిటీల్లో మంచినీటి కోసం 52 రిజర్వాయర్లు రికార్డు స్థాయిలో పూర్తిచేశామన్నారు. నగరంతో పాటు ఓఆర్ఆర్ ఫేజ్ 1 ద్వారా గ్రామాల ప్రజలకూ తాగునీరు అందిస్తున్నామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో 60శాతం మందికిపైగా 20వేల లీటర్ల ఉచితంగా అందిస్తున్నామన్నారు. 100శాతం మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్‌టిపిలు నిర్మిస్తున్నామన్నారు. ఇవి త్వరలో అందుబాటులోకి వస్తాయన్నారు.

**యూనియన్ నేతల నిరసనలు :** జలమండలి ప్రధాన కార్యాలయంపై బిజెపి కార్పొరేటర్లు మంగళవారం దాడిని వివిధ సంఘాల నేతలు నాయకులు నిరసన తెలిపారు. జలమండలి ప్రధాన కార్యాలయం ముందు తమకు రక్షణ కల్పించాలని నిరసనకు దిగారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రధానకార్యాలయం, మూసాపేట సెక్షన్ కార్యాలయాల్లో కొందరు ప్రజాప్రతినిధులు దాడి చేయడం సరికాదన్నా రు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంస్థలో దాదాపు 30శాతం మంది మహిళలు పనిచేస్తున్నారని, ఈ ఘటన వల్ల వారు భయాందోళనకు గురౌతున్నారన్నారు.

## ప్రయాణికుల సౌకర్యార్థమే అందుబాటులోకి డీలక్స్ బస్సులు : మంత్రి హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : పెరుగుతున్న అవసరాలు,ప్రజా సౌకర్యార్థం ప్రయాణీకులను తమ గమ్య స్థానాలకు క్షేమంగా చేరవేదయంతో పాటు రద్దీకి అనుగుణంగా నూతన డీలక్స్ సర్వీస్ బస్సులను అందుబాటులోకి తీసుకరావడం జరిగిందని రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో అర్టీసి డిపో అధ్వర్యంలో సిద్దిపేట వయా షోలాపూర్ వరకు మూడు నూతన డీలక్స్ సర్వీసు బస్సులను బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ షోలాపూర్ వెళ్లే ప్రయాణీకులు అందరూ అధునాతన బస్సు సౌకర్యాన్ని వినియోగించుకొని సౌకర్యవంతమైన తక్కువ సమయంలో గమ్యస్థానం చేరుకునే బస్సులో ప్రయాణించి ప్రయాణ అనుభూతిని పొందాలన్నారు. సిద్దిపేట నుంచి మరో 5 డీలక్స్ బస్సులు వచ్చే వారం రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్, జహీరాబాద్, ఉమ్మాబాద్, ఉమర్గ,నల్‌దుర్గ్ మీదుగా షోలాపూర్‌కు బస్సులు నడుస్తాయన్నారు. నూతన డీలక్స్ సర్వీస్ బస్సులు సిద్దిపేట నుంచి ప్రతి రోజు ఉదయం 6.30కి అలాగే సాయంత్రం 6.20కి షోలాపూర్ బయలు దేరుతాయన్నారు. షోలాపూర్ నుంచి సిద్దిపేటకు ఉదయం 7.30 అలాగే రాత్రి 10గంటలకు బయలు దేరుతాయన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ZCTO, చార్మినార్ జోన్, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
GHMC

నిట్ నం.02/ZCTO/CRZ/GHMC/2023-24 తేదీ: 02.05.2023
పని యొక్క స్వభావం : 2023-24 సంవత్సరానికి GHMC 25 టన్నర్ వాహనాలకు ట్యూబ్‌లు మరియు ఫ్లాప్‌లతో టైర్ల వినియోగాల యొక్క సేకరణ. అంచనా ధర: (రూ.లక్షలలో) 8.53. బిడ్ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 03.05.2023 ఉ.11.00గం. పత్ర, బిడ్ల స్వీకరణకు చివరి తేదీ: 06.05.2023 ఉ.11.00గం. పత్ర, అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: శ్రీమతి ఎమ్.వి.రాధిక, ZCTO, CRZ, GHMC, హైదరాబాద్. ఫోన్ నెం. 8008102048. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. గమనిక: టెండర్ ప్రకటన తేదీ తరవాత 1% బయానా పొందవచ్చును.
DIPR.No.1160-PP/CL/Advt/1/2023-24 తేదీ: 03.05.2023 సం/-. ZCTO, CRZ, GHMC.



వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, NEETU BHAN, W/o Kuldeep Bhan, R/o Flat No.104, Sai Kishore Residency, Road No. 4, Balaji Nagar, Manikonda, Puppalaguda, Hyderabad, Telangana - 500089, Have changed my name in all Records for the purpose of passport as NEETU RAINA.
(Ro.No.061636 )

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



PUBLIC NOTICE

General Public are hereby informed that my clients agreed to purchase the House bearing G.H.M.C. No.14-1-369, PTI No.1051402331, consisting of Ground, First and Second Floors, admeasuring 208.17 Square yards, equivalent to 174.05 Square metres, situated at Aghapura, Hyderabad, Telangana State, and bounded by: NORTH: House No.14-1-369/1, SOUTH: Neighbour's Property, EAST: Neighbour's Property, and WEST: Road, from its owners and possessors (1)SRI. D.RAMA CHANDRAIAH, S/o.Late D.Venkaiah, (2) SRI. D.SRINIVAS, S/o.Sri. D.Ramachandraiah, and (3) Dr. D.Krishna Murthy, S/o. Sri. D.Ramachandraiah, all are R/o. H.No.14-1-369, Aghapura, Hydera bad-500001. If any Person/s, Financial Institution/s or Bank/s has/have any objections, right, title, interest or claims for sale of the above said property, they Shall Contact undersigned with relevant original documents in support of their claims within Five (5) days from the date of publication of this notice, failing which my clients will complete the sale transaction and no claims whatsoever, shall be entertained thereafter and will be deemed to have been waived.

Sd/- ATMARAM KARWA
Advocate
Address: 19-1-996, Gollakhidki, Hyderabad-64, Cell: 9949339330



IN THE COURT OF THE HON'BLE XXV ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURTS: AT: HYDERABAD.
G.W.O.P. No. 12 of 2023

Between:
N. Vivekanand & others ...Petitioners
And
To all concerned & another ...Respondents

To,
All Concerned

NOTICE

Please take notice that the above named Petitioners have filed the above GWOP to appoint the Petitioner No. 1 to be the guardian for the person and property of minor Master N. Mrunal, and the same is posted on 02-06-2023. That if any person/s has got any kind of objection in the above matter may appear before the Hon'ble Court on 02-06-2023 at 10.30 A.M. either personally or through an Advocate, failing the matter will be decided on the material available.

By the Order of the Court
Pawan Kumar Agarwal
Advocate
Counsel for the Petitioners
Phone: 9246530236



CAUTION NOTICE

Under the instructions of our client C.H RAMANAIAH S/o. Venkataiah, Agedabout 58 years, Occ: Business, R/o of H. No. 16-76/A,Sri Krishna Nagar, Near P.N.T. Colony, Dilsukhnagar, Hyderabad, We, issue the following caution notice. General Public is hereby cautioned not to deal in any way in respect of Property admeasuring 2400.00 Square Yards, in Ward No.11, Block No.13, forming Part of Survey No.7/AA of Saroornagar Village, situated at Margadarsi Colony, Saroornagar Village and Mandal, Ranga Reddy District. Telangana State, and bounded by: NORTH: 30' feet wide Road, SOUTH: 30' feet wide Road, EAST: 60' feet wide Road, WEST: Western Part of Land in Survey No.7/AA, belongs to Neighbour's. The said property is under registered agreement of sale cum GPA vide Document No.714 of 2009, dated: 07-03-2009, registered at SRO Saroornagar, R.R. District. Whereas some third parties by claiming the above said property forming part of Survey No.7/AA of Saroornagar Village, even though the MRO Saroor Nagar, in proceedings bearing letter No. A/SPL/2018 Dated 20- 06-2018 has clarified that the insertion of Survey No. 7/AA is for the purpose of ROR, but the same is part and parcel of Survey No.7/A, but the third parties as well as the principals of our client by suppressing real and material facts and the pendency of the civil cases in various courts are trying to dispose of the said property which is illegal. Any person or persons deals in the above said property they will be doing so on their own cost and consequences. Hence the Public in General is warn from entering or dealing with any sort of transaction in respect of the above said property except with our client.

Sd/-M/s. SYED ASHFAQ AHMED
MOHD. RIYAZAT ALI
Advocates
Office at: No.29-454,1 st Floor, Keshav Nagar, Neredmet, Secunderabad – 500 056.
Phone# 9392480056/9985859134.
Email: syedashfaqahmed77@gmail.com



BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL-II, 1st Floor, Triveni complex, Abids, Hyderabad.
O.A. No. 806 OF 2022

Between :
Union Bank Of India, S R Nagar, Hyderabad . ....Applicant
AND
Mrs Duggirala Naga Padmaja and another ....Defendants

To,
1) Mrs Duggirala Naga Padmaja, w/o Durga Prasad Rao, Aged 55 years, Plot No.79 part & Plot No.8, Venktraya Estates, Nizampet Village, Quthbullapur, Medchal-Malkajgiri District- 500090.
2) Mr Duggirala Durga Prasad Rao @Duggirala S V Prasad Rao, s/o Yesu Prabhu, Aged 63 years, Plot No.79 part & Plot No.8, Venktraya Estates, Nizampet Village, Quthbullapur, Medchal-Malkajgiri District-500090. ...Defendants.

Whereas, O.A. No. 806 OF 2022 was listed before the Registrar on 21-04-2023.
Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons/notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.23,79,493- 59/- (rupees twenty three lakh seventy nine thousand four hundred ninety three and fifty nine paise only) (Application along with copies of documents etc., annexed). In accordance with Sub-section (4) of the Section 19 of Recovery of Debts Due to the Banks and Financial Institutions Act, 1993, you the defendants are directed as under:
(i)to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii)to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii)you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv)you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v)You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before the Registrar on 14-06-2023 at 10.30A.M., failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this the 24th day of April, 2023.

(By Order of the Tribunal)
REGISTRAR
DEBTS RECOVERY TRIBUNA-II, 1st FLOOR, TRIVENI COMPLEX ABIDS, HYDERABAD.

# అక్రమ నిర్మాణాల వల్లే ముంపు సమస్య



- నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాల - అంతా మా ఇష్టం
- 15 ఫీట్ల దారి లేనిచోట బహుళ అంతస్తులు
- బడా నిర్మాణదారులకు కొమ్ము కాస్తు...
- చిన్నవారికి ఇబ్బందులు పెడుతున్న అధికారులు
- అక్రమార్జనే ధ్యేయంగా టౌన్ ప్లానింగ్ అధికారులు

- మేం మారం... మేము ఇంతే... మా ఇష్టం... అన్నట్లుగా ఉంది టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు.
- ఎన్ని విమర్శలు వచ్చినా.. ఎన్ని ఫిర్యాదులు వచ్చినా... బలాదూర్ అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.
- అక్రమ నిర్మాణాలను కట్టడి చేయాల్సిన వారే అక్రమార్జనకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- పేదోడికో న్యాయం.. పెద్దోడికో న్యాయం... అనే విధంగా ఉంది టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహారం.
- పుట్టగొడుగుల్లా వెలిసి అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్న చేతివాటానికి అలవాటు పడ్డ టౌన్ ప్లానింగ్
- అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- అక్రమ నిర్మాణాలవల్ల అనేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయని స్థానికులు అధికారుల తీరుపై ఆగ్రహం
- నగరంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పటికీ అధికారులు కళ్లు తెరుచుకోవడం లేదంటే...
- ఏ మేర టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్నారో బట్టబయలు అవుతుంది.

**ఎల్.బి.నగర్ మే 3 ప్రభాతవార్త :** సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్‌అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపాట్ల పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ నిబంధనలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలు జరగడం టౌన్‌ప్లానింగ్ అధికారుల పట్ల వరంగా మారింది. అక్రమనిర్మాణాలకు సంబంధించి స్థానికులు ఎవరైనా ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులకే లాభం చేకూరుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎవరు స్పందించడం లేదని పలువురు ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని గడ్డిఅన్నారం, చైతన్యపురి డివిజన్ పరిధిలో అక్రమ భవన నిర్మాణాల పరంపర యదేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో చిన్నపాటి వర్షాలకు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి అంటే అందుకు అక్రమ నిర్మాణాలే కారణమని స్థానికులు అంటున్నారు. గత 2సంవత్సరాల క్రితం గడ్డిఅన్నారం డివిజన్‌లోని అనేక కాలనీలు ముంపునకు గురయ్యాయి. చిన్నపాటి గల్లిలలో కూడా పెద్ద భవనాలు నిర్మించడం వల్లే వర్షం కారణంగా వస్తున్న వరద నీరు కాలనీలలో చేరి అనేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. నిర్మాణదారులను నిబంధనల పేరిట అనేక రకాల ఇబ్బందులకు గురి చేసే టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇవన్నీ కనిపించడం లేదా అని స్థానిక కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. కనీసం 15 ఫీట్ల రోడ్డు కూడా లేని ప్రాంతంలో ఏకంగా ఐదు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారుంటే అందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏమేరా నిర్మాణదారులకు సహకరిస్తున్నారో బట్టబయలవుతుంది. కనీసం ఒక కారు వెళ్లడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నగల్లీలో కూడా ఐదంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని స్థానిక కాలనీవాసులు అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎవరైనా 100, 150 గజాలలో నిర్మాణాలు జరిపితే మాత్రం టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది నిబంధనల పేరిట నానా రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపించాల్సిన అధికారులే అక్రమార్జనకు పాల్పడుతూ కాలనీల ముంపునకు కారకులవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు చేస్తున్న ఫిర్యాదులపై స్పందించకపోగా అక్రమ నిర్మాణదారులకు టౌన్‌ప్లానింగ్ అధికారులు కొమ్ముకాస్తూ పలురకాల సూచనలు కూడా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చేతివాటానికి అలవాటు పడ్డ టౌన ప్లానింగ్ అధికారులు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుతో కాలనీలు ముంపుకు గురికావడంతో పాటు అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గత రెండుమూడు నెలలుగా సికింద్రాబాద్, ఆబిడ్స్, బేగంపేటలో భవనాలు అగ్నికి ఆహుతి అయిన ఘటనలు నిత్యం చోటు చేసుకున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం పాటలు నేర్చుకోకపోవడం గమనార్హం. ఎక్కడైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఉన్నతాధికారులతో సహా అందరూ హడావిడి చేసి వెళ్తున్నారే తప్ప అక్రమ నిర్మాణాలు జరిగే సమయంలో అడ్డుకట్ట వేయడంలో ఎందుకు ముందడుగు వేయడం లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్న నిర్వాకం వల్ల జిహెచ్‌ఎంసి వందల కోట్ల ఆదాయానికి గండిపడుతోంది. ఇంత జరుగుతున్నా ఏమిటి ఈ మౌనం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి వస్తుందని కాలనీవాసులు అంటున్నారు.

## నగరంలో ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది : కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్.బి.నగర్, మే 3 ప్రభాతవార్త :** చిన్న వర్షానికే అతలాకుతలమవుతున్న హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలకి రక్షణ లేకుండా పోయిందని సరూర్‌నగర్‌డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిహెచ్‌ఎంసి కౌన్సిల్‌కి హాజరవుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు తన భద్రత గురించి ఆలోచించి లైఫ్‌జాకెట్, స్విమ్మింగ్‌ట్యూబ్, ఫైర్ ఎక్స్టింగిషర్ ఇవ్వడంతో వాటిని ధరించి కౌన్సిల్ సమావేశానికి వెళ్లారు. అయితే సమావేశానికి వెళ్లి జాగ్రత్తగా ఇంటికి తిరిగి రమ్మని కుటుంబ సభ్యులు సూచించారని కార్పొరేటర్ తెలిపారు. వర్షాల కారణంగా నగరంలో గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి మొద్దునిద్ర వదిలి హైదరాబాద్ లోని పెండింగ్ నాలా పనులు, డ్రైనేజీ వ్యవస్థ తక్షణమే సరిదిద్ది ప్రజలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే రానున్న రోజులలో మీరే ప్రతి ఇంటికి లైఫ్‌జాకెట్, స్విమ్మింగ్‌ట్యూబ్, ఫైర్ ఎక్స్టింగిషర్ ఇవ్వాల్సి వస్తుందని ఎద్దేవా చేశారు. జిహెచ్‌ఎంసి ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతున్న అభివృద్ధిపనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయని కోట్ల రూపాయల ప్రజాధనం ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని కోరారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, మే 3 ప్రభాతవార్త :** అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మూసారాబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని శాలివాహననగర్‌లో నాలా పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలోపు నాలా పనులను పూర్తిచేయాలని, నీరు బయటకురాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో ఇప్పటివరకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడడం జరిగిందని త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో నిత్యం వివిధ శాఖల అధికారులతో కలిసి పాదయాత్రలు చేస్తూ స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిలు, సందీప్, దినేష్, లక్ష్మణ్, శ్రీశైలం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## రాక్ తొలగింపు పనులను పరిశీలన : కార్పొరేటర్ సునితరాముయాదవ్

**మల్కాజిగిరి, మే 3 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి మైనంపల్లి హన్మంతరావు ఆదేశాలతో గౌతమ్‌నగర్ రోడ్డు మధ్యలో రాక్ తొలగింపు పనులను కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుమధ్యలో రాక్ ఉండడంతో రాక్‌ను తొలగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రామూయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేద గృహిణికి ఉచితంగా 60 గజాల స్థలం

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడకు చెందిన పేద మహిళ ఎం.కళావతికి కెఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి తన స్వంత భూమి నుండి 60 గజాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఈ మేరకు ఆమన్‌గల్‌లో ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించిన 60 గజాలకు సంబంధించిన స్థలం డాక్యుమెంట్‌ను బుధవారం ఆయన ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా కళావతి, ఆమె కుటుంబ సభ్యులు కొత్త మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సినీ రంగానికి వన్నె తెచ్చిన దాసరి : ఉప్పల



జ్ఞాపికను అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, మే 3 ప్రభాతవార్త :** తెలుగు చలనచిత్ర రంగానికి వన్నెతెచ్చిన మహాదర్శకుడు దాసరి నారాయణరావు అని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీచైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ప్రముఖ తెలుగు సినీదర్శకుడు దాసరి నారాయణరావు 77వ జయంతి కార్యక్రమం బుధవారం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగానికి దాసరి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనేక సాంఘిక చిత్రాలకు దర్శకత్వం వహించి తెలుగు ప్రజలకు దాసరి స్ఫూర్తిగా నిలిచారన్నారు. సామాన్య ప్రజల జీవిత స్థితిగతులను చిత్రంగా మలిచిన గొప్పదర్శకుడు దాసరి అన్నారు. ఒకప్పుడు హీరోల ఫోటోలే పోస్టర్లపై కనిపించేవని, అలాంటి సమయంలో దర్శకుల ఫోటోలు కనిపించడం దాసరితోనే ప్రారంభంకావడం ఆయన నైపుణ్యానికి నిదర్శనమన్నారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు, నిర్మాత, దర్శకుడిగా సింగిల్‌కార్డ్ రావడం దాసరి ప్రతిభకు నిదర్శనమన్నారు. ఆయన ఈ శతాబ్ద దర్శకుడంటూ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ ప్రముఖ దర్శకులు చంద్రమహేష్, డాక్టర్ పిసి.ఆదిత్యలను జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సత్కరించారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరీ శంకర్, రెడీ టు సర్వ్ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలపై డిప్యూటీ మేయర్‌కు వినతి

**తార్నాక, మే 3 ప్రభాతవార్త:** తార్నాక డివిజన్ నాగార్జుననగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డికి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పార్కుల్లో ఓపెన్ జిమ్, పార్కుకు వచ్చిన వారు కూర్చునేందుకు బెంచీలను, టాయిలెట్ల గదులను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి డిప్యూటీ మేయర్, బీఆర్‌ఎస్ కార్మికవిభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షులు ప్రొ. తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి జలందర్ రెడ్డి, కోషాదికారి వినోద్, కమిటీ సభ్యులు సుబ్బారావు, కోఆప్షన్ సభ్యులు సంధ్యారాణి తధితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి వ్యాపారులు భాగస్వామ్యం కావాలి : కమిషనర్ సాబేర్ అలీ



ట్రేడ్ లైసెన్స్ ఫీజును కమిషనర్ అలీకి అందజేస్తున్న వ్యాపారస్తులు

**తుర్కయంజాల్, మే 3 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి వ్యాపారస్తులు అంతా భాగస్వాములు కావాలని వ్యాపార లైసెన్స్ తీసుకొని సహకరించాలని కమిషనర్ సాబేర్ ఆలీ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం డాల్ఫిన్ ఫుడ్ ఇండస్ట్రీస్ వారు స్వచ్ఛంధంగా కార్యాలయానికి వచ్చి ట్రేడ్ లైసెన్స్ ఫీజు 2 లక్షల రూపాయలు చెల్లించడంతో కమిషనర్ వారిని అభినందించారు. వ్యాపార లైసెన్స్‌ను ప్రతి వ్యాపారి తీసుకోవాలన్నారు. ఫంక్షన్ హాల్ యజమానులు, చిన్న తరహా పరిశ్రమలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలని లేని పక్షంలో విధించే జరినామాలకు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజ్, జవాన్లు పాల్గొన్నారు.

## ఢిల్లీకి తరలిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి



ఢిల్లీకి వెళ్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్‌రెడ్డిలు

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో నూతనంగా నిర్మించిన బిఆర్‌ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి బుధవారం తరలివెళ్ళారు. జాతీయ పార్టీగా బిఆర్‌ఎస్ అవతరించిన తర్వాత పార్టీ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో ఉండాలనే ఉద్దేశ్యంతో పార్టీ వ్యవస్థాపకుడు, సిఎం కెసిఆర్ ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నూతన కార్యాలయాన్ని నిర్మించారు. ఈ నేపథ్యంలో గురువారం కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ మీడియా సెల్ స్పోక్స్ పర్సన్ కార్తీక్‌రెడ్డితో కలిసి బుధవారం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి ఢిల్లీకి బయలుదేరి వెళ్ళారు.

## నేడు బిజెపి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు ప్రారంభించనున్న బండి సంజయ్

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ ఈ క్యాంపులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని నియోజకవర్గ పార్టీ పిఆర్‌ఓ హనుమంతరావు కోరారు.

## ఆస్తమా వ్యాధితో భయపడాల్సిన అవసరం లేదు : తనికెళ్ళ భరణి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తనికెళ్ళ, డాక్టర్ గాయత్రి కామినేని

**మన్సూరాబాద్, మే 3 ప్రభాతవార్త :** ఆస్తమావ్యాధి అంటే భయపడేంత ప్రమాదకారి కాదని, వైద్యుల సలహాలు, సూచనలతో పూర్తిగా నివారించవచ్చని ప్రముఖ నటుడు తనికెళ్ళ భరణి పేర్కొన్నారు. ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ఎల్‌బినగర్ కామినేని హాస్పిటల్‌లో బుధవారం అందరికీ ఆస్థమా వైద్యంపేరుతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తనకు 6 యేళ్ల వయసునుండి ఆస్తమా ఉందనికానీ చిన్నప్పుడు ఆయుర్వేద, వంటింటి చిట్కాలు పాటించినా ఫలితం అంతగా లేదన్నారు. చేప మందు సైతం తీసుకున్నామని, చివరకు ఇన్‌హేలర్‌తో పాటు వైద్యుల సలహాలు సూచనలతో ఇప్పుడు పూర్తిగా కోలుకున్నమని అన్నారు. బ్రతకాలి అనే సంకల్పం ఉంటే ఎంత పెద్ద జబ్బునైనా జయించవచ్చని తెలిపారు. ఆస్తమాపై కామినేని హాస్పిటల్ యాజమాన్యం ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.. ఆసుపత్రి సిఓ ఓ గాయత్రి కామినేని మాట్లాడుతూ ఈ వ్యాధి నివారణ కోసం తమ ఆసుపత్రి వైద్యులు ముందుంటారని మే 2 నుండి 6 వ తేదీ వరకు ఉచిత ఆస్తమా స్క్రీనింగ్ క్యాంప్‌ను చేపడుతన్నామని ఈ సందర్భంగా స్క్రీనింగ్ క్యాంప్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవీంద్రరెడ్డి, మార్కెటింగ్ హెడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం : తోట

**ఎల్.బి.నగర్ మే 3 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బిఆర్‌ఎస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని చైతన్యపురి డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ పేర్కొన్నారు. ఎల్‌బినగర్ నియోజకవర్గ నూతన బిఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైన ముద్ద కళ్యాణ్‌ను చైతన్యపురి నాయకులు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కర్మంఘాట్ హనుమాన్ టెంపుల్ మాజీ చైర్మన్ కోతి నర్సిరెడ్డి, నాయకుడు రాజ్ కుమార్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంజీర నీటి సమస్యకు పరిష్కారం : కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్



మోటారు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ తదితరులు

**మల్కాజిగిరి, మే 3 ప్రభాతవార్త :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని జోహార్‌నగర్‌లో మోటార్ చెడిపోవడంతో గత 5 రోజుల నుండి మంజీరా నీరు రావడం లేదని స్థానికులు కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులను కలిసి వారితో పాటు మోటారును పరిశీలించడం జరిగింది. పాత మోటార్ స్థానంలో మరొక ఏర్పాటు చేసి నేటి నుండి నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం హాస్రిత, మేనేజర్ వేణుగోపాల్ నాయుడు, ఏఈ శ్రీకాంత్, జోహార్‌నగర్ కమిటీ సభ్యులు మల్లేష్‌గౌడ్, కృష్ణరెడ్డి, ముజీబ్, వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, దీప్తి, సంపత్‌రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లెలగూడలోని చారిత్రక వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ మాజీ ధర్మకర్తలు, భక్తులు (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## సీ.ఎం. రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి

**వనస్థలిపురం, మే 3 ప్రభాతవార్త :** వనస్థలిపురం డివిజన్ పరిధిలోని హిల్ కాలనీకి చెందిన మల్లేష్ గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో హాస్పిటల్‌లో చేరికయ్యారు. చికిత్స అనంతరం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. వారి ఆర్థిక స్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆపరేషన్‌కు అయిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడంతో వారికి లక్ష యాభై వేల రూపాయలు చెక్కు మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సిఎం సహాయనిధి పథకం ఓ వరం లాంటిదని, నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ భారాస అధ్యక్షులు చింతల రవికుమార్‌గుప్తా, కిట్టు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి : హయ్యత్ హుస్సేన్ హబీబ్



హోంమంత్రికి అభినందనలు తెలుపుతున్న హయ్యత్ హుస్సేన్ తదితరులు

**మలక్‌పేట, మే 3 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని బిఆర్‌ఎస్ చావుని డివిజన్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తనకు కేటాయించిన ఛాంబర్‌లో కొలువుదీరారు. కాగా బిఆర్‌ఎస్ చావుని డివిజన్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్ ఆధ్వర్యంలో హోంమంత్రి మహమూద్ అలీకి పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకోసం ఎంతో కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వృద్ధుడిని చేర దీసిన మాతృదేవోభవ అనాధాశ్రమం

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** మతిస్థిమితం లేని ఓ అభాగ్య వృద్ధుడిని నాదర్‌గుల్ మాతృ దేవోభవ అనాధాశ్రమం చేరదీసి ఆశ్రయం కల్పించింది. బుధవారం బడంగ్‌పేట్ ఎంసిఆర్ కాలనీలో సుమారు 80 సంవత్సరాలు ఉన్న మతిస్థిమితం లేని ఒక వృద్ధుడు దీనావస్థలో ఉన్నాడని సమాచారం అందడంతో ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి సిబ్బందితో వెళ్ళి వృద్ధుడిని ఆశ్రమానికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డికి సమాచారం ఇచ్చి ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ అభాగ్యులకోసమే ఆశ్రమాన్ని నెలకొల్పి సేవలందిస్తున్నట్లు తెలిపారు.

## రూ.30లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనుల ప్రారంభం : కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి



యూజిడి పనులను ప్రారంభిస్తున్న కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి..

**నేరెడ్‌మెట్, మే 3 ప్రభాతవార్త :** సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో తనవంతు కృషిచేస్తానని మల్కాజిగిరి సర్కిల్ బిఆర్‌ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు.బుధవారం నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని అర్.కె.పురం బ్యాంక్‌కాలనీలో రూ. 30లక్షలతో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ పనులను అయన స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి ఎంతో కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలే తన సమస్యలుగా భావించి వాటిని పరిష్కరించే దిశగా ప్రణాళికలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఇ సృజన, పాపిరెడ్డి, చెన్నారెడ్డి, రాకేష్, మంగళాల్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శివరామ క్షేత్ర ఆలయ కమిటీ ఛైర్మన్‌గా మద్ది రాజశేఖర్‌రెడ్డి



ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మద్ది రాజశేఖర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ మండలంలోని కర్మన్‌ఘాట్ జానకీ ఎన్‌క్లేవ్‌లోనున్న శ్రీ శివరామ క్షేత్ర ఆలయ కమిటీ ఛైర్మన్‌గా మద్ది రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆలయ కమిటీ ఎన్నికల సందర్భంగా ఆయనను ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. వైస్ ఛైర్మన్‌గా నరెడ్ల సుభాష్‌చంద్రారెడ్డి, కమిటీ మెంబర్‌గా దొడ్ల వెంకట్‌రెడ్డిలు నియమితులయ్యారు. అయితే నూతన కమిటీకి ఎన్నికైన వారు బుధవారం ఉదయం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కమిటీ కార్యవర్గంతో కలిసి ఆలయ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.శాంతిలాల్, ఎం.సతీష్, కె.రవీంద్రనాథ్, ఆర్.రుక్మారెడ్డి, కెవిఎన్‌ఆర్ ఆంజనేయులు, పి.జగదీశ్వర్, బి.జనార్థన్, అరుణ, సత్యమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా ఆలయ అభివృద్ధికి మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి రూ.1,11,111లు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.